# కొత్త బాట

అనగా అనగా ఒక వూరు. రివిన్యూ రికార్డుల ప్రకారం ఆ వూరి పేరు వేంకటాపురం. కానీ వెంకటాపుర మంటే ఎవరికీ తెలియదు. అడవిలో పల్లె అనాలి. అడవిలోపల్లె అనేది అన్వర్థనామధేయం. చుట్టూ అడవి, మధ్యలో పల్లె.

అపరాధంచేసి కొండగుహలో దాక్కున్న నేరస్తుడిలా నాగరికతకు దూరంగా అడవుల్లో నిద్రపోతున్న వూరు వేంకటాపురం.

అంగ వంగ కళింగ అంటూ యాభై ఆరు దేశాల పేర్లు చెబుతారు గదా! వెంకటాపురం యాభైయోడోదేశం. ఆ దేశానికి ప్రభువుగాని ప్రభువు వెంకటాద్రి. ఆ ప్రభువు దగ్గర మంత్రి గాని మంత్రి సిద్ధాంతి.

ఆ ప్రభువూ, ఈ మంత్రీ గూడా వెంకటాపురానికి పెట్టని కోటగోడల్లాంటి వాళ్ళు. ఆ వూళ్ళో వెంకటాద్రిగారి మాటకంటే శాసనం లేదు.

సిద్ధాంతి మాటకంటే మంత్రంలేదు.

"విన్నావా సిద్ధాంతీ!" అంటారు వెంకటాద్రిగారు.

"ఏమిటండీ వెంకటాద్రిగారూ!" అంటాడు సిద్ధాంతి.

"ఊరూరికీ బళ్ళు పెడుతున్నారట! ఐదేండ్లు నిండిన ప్రతి బిడ్డనూ బడిలో చేర్పించి నిర్బంధంగా చదువు చెప్పిస్తారట! అందరూ అందలమెక్కితే యిక మోసేవాళ్ళెవరో ఆ దేవునికే తెలియాలి. ఎంత వెధవకాలం వచ్చిపడిందో చూచావా?" అంటారు వెంకటాద్రిగారు.

"అప్పుడే ఏమయింది? ముందుందండీ ముసళ్ళపండగ. కొడుకు తండ్రికే నీతులు నేర్పించేకాలం వస్తుందట! ఆడవాళ్ళు ఉద్యోగాలు చేస్తారట! పట్టపగలే చుక్కలు పొడుస్తాయట! వెంపిలిచెట్టుకే నిచ్చెనలు వేసి ఎక్కే మానవులు పుట్టుకొస్తారట!" అంటాడు సిద్ధాంతి.

ఈ ధర్మగ్లాని తమ రాజ్యంలో అడుగుపెట్టడానికి వీల్లేకుండా అప్రమత్తులై కాపలా కాస్తూ ఆ ప్రభువూ, ఈ మంత్రీ గూడా అడవిలో పల్లెలో ధర్మాన్ని నాలుగు పాదాలతోనూ నడిపించుకొస్తున్నారు.

వెంకటాద్రిగారు అప్పులిస్తారు. సిద్ధాంతి ప్రోనోట్లు వ్రాస్తాడు. ఎడమచేతి బొటన వ్రేలితో ముద్రలు వెయ్యడం మాత్రమే మిగిలిన వాళ్ళ వంతు.

అక్కడ కాలచక్రం గూడ సిద్ధాంతి చెప్పినట్టే నడుస్తుంది. సేద్యగాడికి బత్తెం కొలవవలసి వస్తే ఆరునెలలు మూడే నెలలవుతాయి. ప్రోనోటు పైన వడ్డీ లెక్క గట్టవలసి వస్తే రెండేళ్ళు మూడేండ్లుగా పొడిగింపబడతాయి.

అదేం విడ్డూరమో గానీ అడవిలో పల్లెలో పుట్టే బిడ్డలందరూ దుర్లగ్నంలోనే పుడతారు. సిద్ధాంతి వరుసగా అందరికీ గ్రహశాంతి చేయిస్తాడు. గ్రహశాంతి అనగా ఒక పెళ్ళి జరిగినంత తంతు. ఆ మాత్రం ఖర్చు పెట్టుకోకపోతే ఈ దుష్ట గ్రహం శాంతించదంటాడు సిద్ధాంతి.

అడవిలో పల్లెలో ఆరోగ్యశాఖ గూడా సిద్ధాంతిదే. ఆయన యిటు రాజవైద్యంలోనూ, అటు భూతవైద్యంలో గూడా నిష్ణాతుడు. ఆయన మంత్రాలకు దయ్యాలు కొండెక్కడం ఎంతవరకూ నిజమోగానీ, మందుల సంచీ విప్పగానే రోగులు హతాశులై పోవడం మాత్రం అక్షరాల నిజం! ఐతే ఒకటి. ఆయన మందు తగిలేసరికి రోగమైనా రారున ఎగిరిపోతుంది. లేదా గూటిలో నుంచీ చిలుకైనా కాస్తా తుర్రుమంటాది.

ఇంత లక్షణంగా, యింత అభ్యుదయ పరంపరాభివృద్ధిగా వాళ్ళు అడవిలో పల్లెను ఏలుకుంటూ వుండగా యిప్పుడు చెప్పబోతున్న కథ ఈ క్రింది విధంగా ప్రారంభమైంది.

నలుగురు మగబిడ్డల తర్వాత వెంకటాద్రిగారికి లేక లేక ఒక్క కూతురు. యుక్త వయస్సు రాగానే తండ్రి వరుడి కోసం ఊళ్ళూ నాళ్ళూ గాలించేశాడు. మంచి సంబంధం కుదిరింది. ఒకటికి పది పంచాంగాలు త్రిప్పిచూచి సిద్ధాంతిగారే శుభముహూర్తం కుదిర్చాడు. తిరుచానూరులో పెళ్ళి ఏర్పాట్లు ఘనంగా జరుగుతున్నాయి.

పెళ్ళికింక నాలుగు రోజులే వుందనగా ఒక అవాంతరం జరిగింది.

కొత్త బట్టలకోసం పట్టణానికి వెళ్ళిన వెంకటాద్రిగారి పెద్దబ్బాయి నాగరాజు సాయంత్రం బస్సులో తిరిగివచ్చి రాత్రి ఎనిమిది గంటల వేళ రోడ్డులో దిగాడు. పొలం గట్లపైన నాగమల్లి గుట్టలవైపు నడుస్తుండగా ఎక్కడ కాలుజారిందో జారింది. అమాంతంగా అతడు కిందికి పల్టీ కొట్టేశాడు. మోకాటి చిప్ప తొలగిందనీ, తొడ ఎముక విరిగిందనీ

నలుగురూ నాలుగు రకాలుగా చెప్పుకున్నారు.

సిద్ధాంతి శల్యవైద్యంలో గూడా నిపుణుడే! కానీ అదేం గ్రహచారమోమరి, ఆయన కాలిమీద చేయివేస్తే చాలు, నాగరాజు గావుకేకలు పెట్టసాగాడు. కానీ ఎదుటి వాడికి మరణ సంకటమైనప్పటికీ సిద్ధాంతికి చీమకుట్టినట్టయినా వుండదు. కడుపు నిండుకూ సారాయి పోయించి శరీరంపైన స్మారకం లేని స్థితిలో నాగరాజు శరీరాన్ని యిష్టమొచ్చినట్టెల్లా విరిచి సిద్ధాంతి కట్లు కట్టేశాడు. తెలివి వచ్చేసరికి నాగరాజు పైకప్పు ఎగిరిపోయేటట్టుగా హాహారావాలు చేయసాగాడు. సిద్ధాంతి మరేం భయపడవలసిన అవసరం లేదన్నాడు. ధర హెచ్చుట తగ్గుటకొరకే గదా! ఎంత బిగ్గరగా అరిస్తే అంత త్వరగా నయమైపోతుందన్నాడు.

కష్టాలు ఒంటరిగా రావని చెబుతారు పెద్దలు, రేపు సాయంత్రం పెళ్ళికి తరలి వెళ్ళాలనగా ఈరోజు ఉదయం వెంకటాద్రిగారి భార్య పడకపై నుంచీ లేచిందిగాదు. ఒళ్ళు సల సల కాగిపోతోంది. ఉచ్ఛ్వాస నిశ్వాసాల ఉరవడి హెచ్చిపోయి ఆమె కొలిమి తిత్తిలా రొప్పుతోంది. నాలుగు దుప్పట్లు కప్పినా చలికి గజగజలాడి పోవడమే! సిద్ధాంతి అది విష జ్వరమన్నాడు. దాని దుంప తెంపే అమోఘమైన ఔషధం తన దగ్గరున్నదన్నాడు. అడవిలో నుంచీ బుట్టల నిండుకూ ఆకులు తెప్పించి, గిన్నెల నిండుకూ కషాయాలు తయారుచేసి, అదే పనిగా కట్టు మాత్రలు నూరి పశువైద్యమని చెప్పుకోదగినంత గొప్పగా వెంకటాద్రిగారి భార్యకు చికిత్స కొనసాగిస్తున్నాడు.

"మీ భార్యాబిడ్డల ప్రాణాలకు నా ప్రాణం అడ్డువేస్తాను. మీరు నిశ్చింతగా పెళ్ళికి వెళ్ళి రండి" అంటూ వెంకటాద్రిగారికి అతడు నమ్మకం చెప్పాడు.

"నిన్నే నమ్ముకున్నానయ్యా సిద్ధాంతీ! భద్రం భద్రం, ముసల్ది జాగ్రత్త! అబ్బాయి జాగ్రత్త! ఇల్లు జాగ్రత్త!" అంటూ మరి మరీ హెచ్చరించి వెంకటాద్రిగారు బంధువుల్ని తరలించుకుని పెళ్ళికి వెళ్ళిపోయాడు.

పెళ్ళికి కుదిరిన శుభలగ్న ప్రభావమేమో గానీ పులిమీద పుట్రలా లగ్నానికి సరిగ్గా జడివానలు ప్రారంభమయ్యాయి.

దేవలోకపు ఏనుగులు ఘీంకరించి నట్టుగా ఉరుములు - వాటి దంత కాంతులు విరిసినట్టుగా మెరుపులు - అవి తొండాలతో వెదజల్లినట్టుగా కుండపోత వానలు.

ప్రొద్దుపోయి చీకటి పడబోతుండగా ఊరిలో గగ్గోలు చెలరేగింది. మరేం లేదు, సిద్ధాంతిగారి కుమారుడు నాగేశాన్ని పురుగు ముట్టుకుంది.

పాము మంత్రంలో ఆ పాయకట్టుకంతా సిద్ధాంతిదే పెట్టింది పేరు. కానీ స్వంత బిడ్డ దగ్గరికి వచ్చేసరికి అతడి మంత్రం వట్టి పనికిమాలినదైపోయింది. కుర్రవాడు నురగలు కక్కేస్తున్నాడు. పచ్చిమిరపకాయలు పరపర నమిలి మ్రింగేసి కారమే లేదు పొమ్మంటున్నాడు. ఒళ్ళు గూడా చల్లబడిపోవడం ప్రారంభమైయింది. విష జ్వరంతో ఒళ్ళు తెలియకుండా పడివున్న వెంకటాద్రిగారి భార్యను, మంచంపైన ఆక్రోశాలు సలుపుతూ వున్న ఆయన కుమారుణ్ణి, ఆయన జాగ్రత్తగా చూచుకోమని అప్పగించిన యింటినీ అన్నింటినీ మరిచిపోయాడు సిద్ధాంతి. అప్పటికప్పుడు ఓ సవారీ బండి సిద్ధంచేయించి, కొడుకు నందులో వేయించుకొని పట్టణానికి దారితీశాడు.

ఊరికొక అరమైలు దూరంలో చింతలేరు, తీరా ఏటి దగ్గరికి వచ్చేసరికి బ్రహ్మాండంగా వరదలొస్తున్నాయి.

సరిగ్గా అదే సమయానికి తిరుచానూరు నుంచి తిరిగి వస్తున్న పెండ్లివారి బండ్లు ఏటికి అవతలి వైపున నిలిచివున్నాయి.

రొప్పుకుంటూ, రోజు కుంటూ గట్లను ముంచుకుంటూ చింతలేరు ప్రవహిస్తోంది.

సముద్రపు హోరులా కుంభ వర్షం కురుస్తోంది. గాలి వానలో చెట్లు పూనకం సోకిన మనిషిలా వూగిపోతున్నాయి.

పెళ్ళివారి బళ్ళల్లో పరిస్థితి చాలా భీభత్సంగా తయారైంది. తడిసిపోయిన పట్టుచీరల్లో ఆడవాళ్ళు బళ్ళల్లో ఒదుగుళ్ళు పోతున్నారు. చంటిబిడ్డలు గొంతు చించుకుంటున్నారు. మగవాళ్ళు ఏటి వొడ్డున చెట్ల క్రింద నిల్చుని ప్రవాహం వైపు చూస్తున్నారు.

అటువైపు ఏటి వొడ్డున సిద్ధాంతి కట్టించిన సవారీ బండి నీటి అంచుదాకా వచ్చి ఆగిపోయింది. తన బెంగలో తానుండిపోయి సాధ్యాసాధ్యాలను గురించి ఆలోచించకుండా 'తోలు' పరవాలేదు తోలు, అంటూ సిద్ధాంతి బండివాణ్ణి అదిలిస్తున్నాడు.

ఆ అదిలింపుకు ఎద్దులు బెదరిపోయాయి.

మరు నిమిషంలో బండి ఎద్దులతో సహా నట్టేట్లో నిలువెత్తు నీటిలో గింగిర్లు తిరిగిపోతూ వుంది.

దాని అదృష్టం బాగుండి మెడపలుపు వూడి పోవడం వల కాడెద్దుల్లో ఒకటి మాత్రం ఒడ్డుకు చేరుకోగలిగింది. రెండో ఎద్దు, బండీ, మనుషులు గంగపాలైపోయారు.

వరద తగ్గు ముఖం పట్టడానికి రెండు రోజులు పట్టింది. వెంకటాద్రిగారింటికి వెళ్ళి చూచుకునే సరికి ముసలావిడకట్టె మాత్రం మంచంపైన పడి వుంది. కుమారుడు మాత్రం కొనవూపిరితో మిగిలి వున్నాడు. వెంకటాద్రిగారు ఒకసారి భోరుమని ఏడ్చేశారు.

బాటలేక పోబట్టి కుమారుడికి కాలు విరిగింది. తగిన వైద్య సహాయం లేక పోబట్టి భార్య పరిస్థితి విషమించింది. ఏటికి వంతెన లేక పోబట్టి పెండ్లి ఆలగోడు బాలగోడుగా పరిణమించింది. అప్పుడు వెంకటాద్రిగారికి జ్ఞానోదయం గూడా అయింది.

మన్నించాలి, ఇదంతా యిరవయ్యేళ్ళ క్రిందటి పాత కథ. ఇప్పుడు వెంకటాపురంలో బడీ, వైద్యశాల, పోస్టాఫీసు అన్నీ వున్నాయి. ఊరి మధ్య గ్రంథాలయం వుంది. దాని కనుబంధంగా ఒక రేడియో వుంది. రాత్రుల్లో విద్యుద్దీపాలు వెలుగుతున్నాయి. ముఖ్యంగా ఆ వూరికీ ప్రపంచానికి యిప్పుడు లంకెగా చింతలేటిపైన వంతెనతో సహా బాటగూడా వుంది. అది వెంకటాపురానికి వేసినదారి మాత్రమే గాదు, క్రొత్త జీవితానికి, క్రొత్త సమాజానికి వేసిన రహదారి గూడా!

(అరుణోదయ పబ్లిక్‌రిలేషన్స్ పత్రిక)

❀ ❀ ❀

కథా నిలయం
శ్రీకాకుళం